సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



బైక్.. భద్రం!
వర్షాకాలంలో ద్విచక్ర వాహనాలను జాగ్రత్తగా చూసుకోవాలని, వర్షం కురుస్తున్నప్పుడు ప్రయాణించొద్దని సీనియర్ మెకానిక్‌లు సూచిస్తున్నారు. - 8లో▸



అర్చకులకు వేతనాలు అందించాలి
ధూపదీపనైవేద్య అర్చకులకు ప్రతీనెల వేతనాలు అందేలా చూడాలని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్‌ను గంగు ఉపేంద్రశర్మ కోరారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0^0/24.0^0

వాతావరణం
జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆదర్శం ఐలమ్మ పోరాటం



కాజీపేట అర్బన్: చాకలి ఐలమ్మ పోరాటాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు స్నేహశబరీశ్, సత్యశారద అన్నారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా న్యూశాయంపేటలోని ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యేలు, కలెక్టర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ మామిండ్ల రాజు, కుల సంఘాల నాయకులు బస్వరాజు కుమార్, చీకటి శారద, ఆనంద్, మధుచందర్, చిట్యాల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ శిక్షణ ఎంతో ఉపయోగం



కేయూ క్యాంపస్: పరిశోధకులు, అధ్యాపకులకు డిజిటల్ శిక్షణ ఎంతో ఉపయోగమని కాకతీయ యూనివర్సిటీ కేంద్ర గ్రంథాలయం మెంబర్ ఇన్‌చార్జ్, లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.రాధికారాణి అన్నారు. కేయూ సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఈఈఈ) ఆధ్వర్యంలో బుధవారం డేటాబేస్ ఉపయోగంపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ఐఈఈఈ వెబ్‌సైట్‌లో ఉన్న దాదాపు ఆరు మిలియన్ల శాస్త్రీయ పత్రాలు, జర్నల్స్, కాన్ఫరెన్స్ ప్రొసీడింగ్స్ వంటి విలువైన సమాచారం పరిశోధన అవసరాలకు లభిస్తుందని తెలిపారు. డేటాబేస్‌ను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. ఆచార్యులు పి.మల్లారెడ్డి, జె.కృష్ణవేణి, కె.భిక్షాలు, ఆర్.భారవిశర్మ, ఎల్పీ రాజ్‌కుమార్, సుమలత, రాధిక, షాయోదా, ఇజాక్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆర్టీసీ పరిరక్షణ దినం



హన్మకొండ: విద్యుత్ బస్సుల కేటాయింపు విధానంలో మార్పు చేయాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వరంగల్ రీజియన్ కార్యదర్శి బి.ఉపేంద్రచారి అన్నారు. ఈ మేరకు బుధవారం హనుమకొండలోని వరంగల్-1 డిపో వద్ద కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ బస్సుల కోసం ప్రైవేట్ యజమానులకు ఇస్తున్న సబ్సిడీలు, నిధులు, వయాబిలిటీ గ్యాప్ ఫండ్లను ఆర్టీసీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్ట ప్రకారం ఇవ్వాల్సిన నిధులు పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న ఆర్టీసీ పరిరక్షణ దినం పాటించాలని పిలుపునిచ్చారు.

రేపు జిల్లా స్థాయి కళా ఉత్సవ్

విద్యారణ్యపురి: జిల్లాస్థాయికి ఎంపికైన పాఠశాలల విద్యార్థులకు ఈనెల 12న కళా ఉత్సవ్ నిర్వహించనున్నట్లు హనుమకొండ డీఈఓ డి.వాసంతి బుధవారం తెలిపారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో నిర్వహించే కళా ఉత్సవ్‌కు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఓకల్ మ్యూజిక్, సోలో, క్లాసికల్, లైట్ మ్యూజిక్, గ్రూప్ ఇన్‌స్ట్రుమెంటల్, విండ్ మెలోడీ, క్లాసికల్ డ్యాన్స్, జానపద గిరిజన కాంటెంపరరీ కొరియోగ్రఫీ, రోల్‌ప్లే, మిమిక్రీ, మైమ్, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర పోటీల్లో ప్రథమ బహుమతులు పొందిన విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపినవారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని డీఈఓ పేర్కొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు అవకాశం

విద్యారణ్యపురి: ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఆన్‌లైన్ ఇంటర్ అడ్మిషన్లకు ఈనెల 11, 12 తేదీల్లో అవకాశం కల్పించినట్లు వరంగల్ జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి డాక్టర్ శ్రీధర్‌సుమన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌బోర్డు కార్యాలయం నుంచి జరిగిన జూమ్ మీటింగ్‌లో వివిధ అంశాలపై కీలక ఆదేశాలు జారీచేశారని ఆయన పేర్కొన్నారు. అడ్మిషన్ల గడువు ఆగస్టు 31న ముగిసినప్పటికీ పలువురు విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నందున మరోసారి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రైవేట్ కళాశాలల్లో మాత్రం అపరాధ రుసుంతో విద్యార్థులు అడ్మిషన్లు పొందవచ్చని ఆయన సూచించారు.

నగరంలో యథేచ్ఛగా ప్లాస్టిక్ విక్రయాలు
- బహిరంగంగా హోల్‌సేల్, రిటైల్ వ్యాపారం
- మొక్కుబడి దాడులు.. మామూళ్లతో సరి
- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు

నిషేధం నిర్వీర్యం



వరంగల్ అర్బన్: మహా నగరంలో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల నిషేధం వ్యాపారులకు మాత్రమే కాదు.. బల్దియా ప్రజారోగ్యం అధికారులు, సిబ్బందికి కాసుల పంట పండిస్తోంది. నిషేధిత ప్లాస్టిక్‌ను ఆసరాగా చేసుకుని కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఎక్కడికక్కడ మామూళ్ల ఒప్పందంతో కాలం వెళ్లదీస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పాలకవర్గం పెద్దలు, ఉన్నతాధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వినియోగించిన ప్రజలు అనారోగ్యం పాలవుతూ వ్యయప్రయాసలకు గురవుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు.

కాసుల పంట..

ప్లాస్టిక్ వాడకం వల్ల జరుగుతున్న నష్టాలను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా దశాబ్ద కాలంగా 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణానికి విపత్తుగా మారుతుండడంతో ఈ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల వినియోగం తగ్గి పేపర్, నార సంచుల వినియోగం పెరుగుతుందని ప్రభుత్వం భావించింది. కానీ, ఇది క్షేత్రస్థాయిలో అమలుకు సాధ్యం కాకపోవడంతో వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది.

రూ.50 వేల వరకు జరిమానా..

చిరువ్యాపారుల నుంచి హోల్‌సేల్ ప్లాస్టిక్ అమ్మకందారుల వరకు బల్దియా అధికారులు తనిఖీ చేసి రూ.500 నుంచి రూ.50 వేల వరకు జరిమానా విధించే స్థాయి ఉంది. అధికారుల తనిఖీల్లేవు, సిబ్బంది పర్యవేక్షణ లేదు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన కవర్లను హోల్‌సేల్ వ్యాపారులు బహిరంగంగా అమ్ముతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే చిన్న దుకాణం నుంచి భారీ హోల్‌సేల్ దుకాణం నుంచి నెలవారీ మామూళ్లు అందిస్తున్నామంటూ బహిరంగంగా వెల్లడిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్‌ను నియంత్రించాల్సిన అధికారులు, సిబ్బంది కన్నెత్తి చూడకపోగా.. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మాత్రం గుట్టుచప్పుడు కాకుండా ఒప్పందాలు కుదుర్చుకుని చేతి వాటం ప్రదర్శిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ప్లాస్టిక్ నిషేధం పేరిట స్పెషల్ డ్రైవ్ అంటూ పారిశుద్ధ్య కార్మికులతో బృందాలు ఏర్పాటు చేసి టిఫిన్ సెంటర్లు, కిరాణా దుకాణాలు, బేకరీలు, కూరగాయల, మాంసం దుకాణాల్లో మొక్కుబడిగా దాడులు చేస్తూ జరిమానా విధిస్తున్నారు. నిషేధిత ప్లాస్టిక్‌పై పుండు ఒక చోట ఉంటే మందు ఒక చోట పెట్టినట్లు ఉంది బల్దియా శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పనితీరు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు అమ్ముతున్న బడా వ్యాపార సంస్థలను వదిలేసి, చిరువ్యాపారులపై దాడులు చేస్తూ నానాయాగీ చేస్తుండడంపై పలువురు మండిపడుతున్నారు. ప్లాస్టిక్ అమ్మకం నిషేధమే కానీ, హోల్‌సేల్ దుకాణాల్లో ఎందుకు అరికట్టడం లేదని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు.




షాపుల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు



ఖాళీ స్థలంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

హోల్‌సేల్ షాపులపై దాడులు చేస్తాం

నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్న హోల్‌సేల్ షాపుల్లో తనిఖీలు చేస్తాం. చిరువ్యాపారుల కంటే ముందుగా హోల్‌సేల్ వ్యాపారులను కట్టడి చేస్తే అమ్మకం, వాడకం తగ్గుముఖం పడుతోంది. ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటాం.
– డాక్టర్ రాజారెడ్డి, బల్దియా సీఎంహెచ్‌ఓ

రూ.కోట్లలో దోపిడీ..

ప్లాస్టిక్ నిషేధం పేరుతో కవర్లు, గ్లాసుల ధరలను వ్యాపారులు ధరలను రెట్టింపు చేశారు. గతంలో నామమాత్రపు సొమ్ముతో కవర్లు లభించేవి. కానీ, ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ధరలు భగ్గుమంటున్నాయి. ఒక్కో వినియోగదారుడి నుంచి కవర్, గ్లాసుకు రూ.2 నుంచి రూ.5వరకు వసూలు చేస్తుండడాన్ని బట్టి చూస్తే గ్రేటర్ వరంగల్‌లో దోపిడీ రూ.కోట్లల్లోనే జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. రోజుకు స్థానికంగా 4 టన్నుల నుంచి 5 టన్నుల వరకు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల వినియోగం జరుగుతోందని వ్యాపారులు చెబుతున్నారు. ఇలా నిషేధం పేరిట వ్యాపారులు ధరలు పెంచి పెద్ద ఎత్తున ఆదాయం సమకూర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. వరంగల్ పిన్నావారి వీధి, బీట్‌బజార్, హనుమకొండ కుమార్‌పల్లిలోని హోల్‌సేల్ వ్యాపారులు రోజుకు భారీగా ఆర్జిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

మైసూరును తలపించేలా ఉత్సవాలు నిర్వహిద్దాం

- మంత్రి కొండా సురేఖకు రంగలీల మైదానం దసరా ఉత్సవ కమిటీ వినతి



మంత్రి సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న దసరా ఉత్సవ కమిటీ ప్రతినిధులు

ఖిలా వరంగల్: రంగలీల మైదానంలో జరిగే సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలను మైసూరు ఉత్సవాలను తలపించేలా నిర్వహించుకుందామని మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం దసరా ఉత్సవ కమిటీ సభ్యులు వరంగల్ ఓసిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి సురేఖను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి కొండా సురేఖకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. రంగలీల మైదానంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని కోరుతూ మంత్రికి కమిటీ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. వచ్చే నెల 2న రంగలీల మైదానంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో దసరా ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు గోపాల నవీన్‌రాజు, కమిటీ అధ్యక్షుడు ఎస్.సంజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, ఉపాధ్యక్షుడు గోనే రాంప్రసాద్, కమిటీ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, వేణు, అఖిల్‌గౌడ్, అజయ్, మహేశ్, శ్రీను, గోవర్ధన్, సంతోశ్, మధు, రంజిత్, వంశీ, రమేశ్, మనోహర్, కృష్ణ, చరణ్, శ్రీధర్, నరేందర్, అరుణ్, సాయి, రాజశేఖర్, క్రాంతి, అక్తర్, కిషోర్ పాల్గొన్నారు.

'అబాస్' హాజరు విధానాన్ని రద్దు చేయాలి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎంజీఎం: క్షేత్రస్థాయి ఆరోగ్య పర్యవేక్షణ సిబ్బందికి అబాస్ (బయో మెట్రిక్ హాజరు) విధానాన్ని రద్దు చేయాలని క్షేత్రస్థాయి ఆరోగ్య పర్యవేక్షణ సిబ్బంది జిల్లా జేఏసీ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్యను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో 4 నుంచి 13 ఉపకేంద్రాలు ఉన్నాయని, వాటిలో పీహెచ్‌సీకి వెళ్లి బయోమెట్రిక్ హాజరు నమోదు చేసుకుని ఫీల్డ్‌కు వెళ్లాలంటే కనీసం 10 నుంచి 20 కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొన్నారు. 24 గంటలు అత్యవసర సేవల్లో ఉండే క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బందిని పీహెచ్‌సీ కార్యాలయంలోని సిబ్బంది, పర్యవేక్షణ సిబ్బందితో జతకట్టి చూడొద్దని కోరారు. ఇప్పటికే క్షేత్రస్థాయి సిబ్బంది అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు నిర్విరామంగా, నిరంతరాయంగా సమయపాలన లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో క్షేత్రస్థాయి సిబ్బందికి అబాస్ నుంచి మినహాయింపు ఇవ్వడాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు నెహ్రూ చంద్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీరం మధుసూదన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు తోకల మాధవరెడ్డి, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ నాయకులు కత్తి రవీందర్, కె.రమేష్, జ్యోతి, సులోచన, ప్రసన్నకుమారి, శ్రీకాంత్, రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హద్దురాళ్ల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



హద్దురాళ్లు తొలగించిన ఎస్సారెస్పీ భూమి

హసన్‌పర్తి: 'ఎస్సారెస్పీ భూమి కబ్జా' శీర్షికన ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి నీటిపారుదలశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం గుండ్లసింగారం–ముచ్చర్ల మార్గమధ్యలోని ఎస్సారెస్పీ–31 కాల్వ పక్కన ఉన్న భూములను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హద్దులు పాతడానికి సిద్ధం చేసి ఉంచిన రాళ్లను తొలగించారు.

ఆర్మీ ర్యాలీకి పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ స్నేహ శబరీష్
- ఈసారి వేదికవ్వనున్న జేఎన్‌ఎస్
- నవంబర్ 10 నుంచి నిర్వహణ
- ఏర్పాట్లపై అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: హనుమకొండ జేఎన్‌ఎస్‌లో నవంబర్ 10 నుంచి 23 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆర్మీ అధికారులు, కలెక్టర్, వివిధ శాఖల అధికారులు ర్యాలీ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమావేశమై చర్చించారు. ఈసందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ఈ ఏడాది హనుమకొండ జిల్లాలో ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని నిర్వహించే అవకాశం దక్కడంతో విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. సికింద్రాబాద్ లోని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కల్నల్ సునీల్ యాదవ్ మాట్లాడుతూ.. ఇప్పటికే ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన 9 వేల మంది అభ్యర్థులకు ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ర్యాలీ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వై.వి. గణేశ్, ఆర్మీ మేజర్ ప్రకాశ్ రాయ్, ఆర్మీ అధికారులు గురుదయాల్ సింగ్, సుభాష్, వి.వి.నాయుడు, వినోద్‌కుమార్ శర్మ, మనీశ్‌కుమార్, ఆర్డీఓ రాథోడ్ రమేశ్, డీఆర్డీఓ మేన శ్రీను, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, సీపీఓ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీపీఓలకు కౌన్సెలింగ్

జిల్లాలోని 123 క్లస్టర్లకు 125 మంది జీపీఓల కేటాయింపు ప్రక్రియ బుధవారం కలెక్టరేట్‌లో పారదర్శకంగా జరిగినట్లు హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీశ్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కౌన్సెలింగ్ వీడియోగ్రఫీతో డీఆర్‌ఓ వైవీ గణేశ్ ఆధ్వర్యంలో సాగినట్లు పేర్కొన్నారు. 128 మందిలో ముగ్గురు విముఖత చూపించగా 125 మంది జీపీఓలు కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు వివరించారు.

కొలిక్కిరాని టెండర్లు

- ఉచిత చేప పిల్లల పంపిణీలో అలసత్వం
- చెరువుల్లో ఇప్పుడు వదిలితే ఎదుగుదల అంతంతే..
- అధికారుల తీరుపై మత్స్యకారుల అసహనం



హన్మకొండ చౌరస్తా: ఉచిత చేప పిల్లల పంపిణీపై అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. చెరువుల్లో జూన్, జూలై నెలల్లో వదలాల్సిన చేపపిల్లలను ఇంతవరకూ అందించలేదు. సెప్టెంబర్ మొదటి వారం గడిచినా టెండర్ల ప్రక్రియ కొలిక్కి రాకపోవడం ఇందుకు నిదర్శనం. సరైన సమయానికి చేప పిల్లలను అందిస్తే ఇప్పటి వరకు చేప ఎదిగి కనీసం పావుకిలో ఉండేదని, ఇప్పుడు చెరువుల్లో వదిలితే అవి ఎప్పుడు ఎదగుతాయని మత్స్యకారులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. హనుమకొండ జిల్లాలో మొత్తం 813 చెరువులు ఉన్నాయి. గత సంవత్సరం 763 చెరువుల్లో రూ.82.82 లక్షల విలువైన 111.21 లక్షల ఉచిత చేపపిల్లల్ని పంపిణీ చేసినట్లు, సుమారు రూ.3.67 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

సొంతంగా కొని..

మత్స్యశాఖ అధికారులపై నమ్మకం లేని పలు మత్స్య సొసైటీలు ఇప్పటికే వారి పరిధిలోని కొన్ని చెరువుల్లో చేప పిల్లలను వదిలినట్లు సమాచారం. రెండు నెలల క్రితమే జిల్లాలోని పలువురు సొసైటీ సభ్యులు సొంత డబ్బులతో చేప పిల్లలను కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. ఇప్పటికే ఆయా చెరువుల్లో 200 గ్రాముల మేర చేప ఎదిగిందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా, ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత చేప పిల్లల్లో నాణ్యతపై మత్స్యకారులు ఏటా అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు. చేప పిల్లల కనీస సైజు 35 నుంచి 40 ఎంఎం ఉండాలని అధికారులు చెబుతున్నప్పటికీ అమలులో ఎక్కడా కనిపించడం లేదని మత్స్యకారులు బహిరంగంగానే వాపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి.

టెండర్లను ఆహ్వానించాం..

జిల్లాలోని 813 చెరువుల్లో 220.55 లక్షల ఉచిత చేప పిల్లల పంపిణీ కోసం టెండర్లను ఆహ్వానించాం. ఇప్పటి వరకు వరంగల్ జిల్లాకు ఇద్దరు, హనుమకొండ జిల్లా నుంచి ఒక్కరు టెండర్లు దాఖలు చేశారు. ఈ నెల 12వ తేదీ వరకు టెండర్లు వేయడానికి అవకాశం ఉంది.
– నాగమణి, ఇన్‌చార్జ్ జిల్లా మత్స్యశాఖ అధికారి, హనుమకొండ

మద్యం టెండర్లకు కసరత్తు

ఉమ్మడి వరంగల్‌లో 294 దుకాణాలు
- దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలకు పెంపు
- త్వరలో టెండర్ల తేదీల ప్రకటన
- డీసీ కార్యాలయాలకు అందిన మార్గదర్శకాలు



సాక్షిప్రతినిధి, వరంగల్:

వైన్స్ (ఏ4)లకు 2025–27 సంవత్సరాలకు సంబంధించి టెండర్లు నిర్వహించేందుకు ఆబ్కారీ శాఖ సన్నద్ధమవుతోంది. వాస్తవానికి నవంబర్ నెలాఖరుతో గడువు ముగియనుండగా.. ఒక నెల ముందుగానే టెండర్లు నిర్వహించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిసింది. గత ప్రభుత్వం 2023 ఆగస్టులోనే వైన్స్‌ల టెండర్లు నిర్వహించిన విషయం తెలిసిందే. డిసెంబర్ 1 నుంచి కొత్త ఎక్సైజ్ పాలసీ అమల్లోకి వస్తున్నప్పటికీ అక్టోబర్‌లో టెండర్లు నిర్వహించాలని ఆబ్కారీ శాఖ నిర్ణయించినట్లు తెలిసింది. ఈనేపథ్యంలోనే మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్లతో ఇటీవల హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. దీంతో అక్టోబర్ మొదటి వారంలో నోటిఫికేషన్ వెలువడవచ్చని అధికారులు భావిస్తున్నారు.

డిసెంబర్ 1 నుంచే కొత్త దుకాణాలు

ప్రభుత్వం మద్యం దుకాణాల టెండర్ల సందర్భంగా 2023–25 ఎక్సైజ్ పాలసీనే అమలు చేయనున్నట్లు చెబుతున్నారు. ఈసారి కూడా ఆరు స్లాబుల విధానాన్నే అమలు చేయనున్నట్లు తెలిసింది. గతంలో 5 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాలకు రూ.50 లక్షల లైసెన్స్ ఫీజు వసూలు చేశారు. 5 వేల నుంచి 50 వేలలోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు, 50 వేల నుంచి లక్ష జనాభాకు రూ.60 లక్షలు, లక్ష జనాభా నుంచి 5 లక్షల్లోపు ఉన్న ప్రాంతాలకు రూ.65 లక్షలు, 5 లక్షల నుంచి 20 లక్షల్లోపు జనాభా ప్రాంతాలకు రూ.85 లక్షలు, 20 లక్షలకు పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.1.10 కోట్లు లైసెన్స్ ఫీజు నిర్ణయించారు. ఈసారి కూడా అదే పాలసీ అమలు చేయనుండడంతో ఎప్పటిలాగే టెండర్లు వేసేందుకు ఆశావహులు సిద్ధమవుతున్నారు. కాగా, డిసెంబర్ ఒకటి నుంచి రాబోయే రెండేళ్లకు సంబంధించి కొత్త పాలసీ అమలుల్లోకి రానుండగా.. గతంలో మాదిరిగానే దుకాణాలకు సంబంధించి మూడు సామాజికవర్గాల (గౌడ, ఎస్సీ, ఎస్టీ) వ్యాపారులకు 30 శాతం వరకు రిజర్వేషన్లు కేటాయించనున్నారు. ఈసారి మద్యం దుకాణాల టెండర్లు పోటాపోటీగా సాగనున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మేడారం సమ్మక్క–సారలమ్మ–జాతరతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరగనున్న నేపథ్యంలో మద్యం అమ్మకాలు జోరుగా సాగనున్నాయన్న చర్చ ఇప్పటికే సాగుతోంది.

రిజర్వేషన్లు యథాతథం.. దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలు

మద్యం దుకాణాల కేటాయింపులో రిజర్వేషన్లు యథాతథంగా అమలు కానున్నట్లు, ఎప్పుడు నోటిఫికేషన్ వెలువడినా.. టెండర్లు నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈమేరకు మద్యం దుకాణాల్లో గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం కేటాయించేలా జిల్లాల వారీగా మద్యనిషేధ, ఆబ్కారీ శాఖ చేస్తున్న కసరత్తు తుదిదశకు చేరినట్లు సమాచారం. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జేఎస్ భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో 2021–23 సంవత్సరాల నుంచి ఈ రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. ఈసారి కూడా ఉమ్మడి వరంగల్‌లో 294 మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు పాటించనున్నారు. ఈలెక్కన ఉమ్మడి వరంగల్‌లో 15 శాతం రిజర్వేషన్ల కింద గౌడ సామాజికవర్గానికి 39 నుంచి 44 దుకాణాలు రానున్నాయంటున్నారు. ఎస్సీలకు 27 లేదా 29, ఎస్టీలకు 13 నుంచి 15 దుకాణాలు కేటాయించనున్నారు. సుమారు 206 నుంచి 215 మద్యం దుకాణాలకు ఓపెన్ కేటగిరీ కింద కేటాయించే అవకాశం ఉండగా.. ఇందులోనూ అన్ని సామాజికవర్గాలు పాల్గొనే వీలుంటుంది. కాగా, ఈసారి కూడా 2011 జనాభా ప్రకారమే షాపులు కేటాయించనుండగా, స్లాబ్‌ల విధానం కూడా గత పాలసీ ప్రకారమే కొనసాగించనున్నారు. అయితే గతంలో టెండర్ దరఖాస్తు ధర రూ.2 లక్షలు ఉండగా.. ఈ సారి రూ.3 లక్షలకు పెంచారు.

ఉమ్మడి వరంగల్‌లో జిల్లాల వారీగా మద్యం దుకాణాలు

జిల్లా పేరు	వైన్స్ సంఖ్య
హనుమకొండ	65
వరంగల్	63
జనగామ	47
మహబూబాబాద్	59
జేఎస్ భూపాలపల్లి, ములుగు	60

లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు ఇవ్వాలి: మేయర్



మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: ఎల్ఆర్ఎస్‌లో భాగంగా లబ్ధిదారులకు సకాలంలో ప్రొసీడింగ్స్ ఇవ్వాలని నగర మేయర్ గుండు సుధారాణి టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్ పురోగతిపై టౌన్‌ప్లానింగ్ అధికారులతో బుధవారం మేయర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగర వ్యాప్తంగా 31 వేల దరఖాస్తులు స్వీకరించగా అందులో 50 శాతం దరఖాస్తులు పరిష్కరించినట్లు తెలిపారు. మిగిలిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్లాట్‌ను శుభ్రం చేసుకోవాలని దరఖాస్తుదారుడికి టౌన్‌ప్లానింగ్ అధికారులు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ సిటీప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, సమ్మయ్య, ఏసీపీలు ఖలీల్, శ్రీనివాస్‌రెడ్డి, టీపీఎస్‌లు, టీపీ బీఓలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధూపదీపనైవేద్య అర్చకులకు వేతనాలు అందించాలి


కమిషనర్‌తో రాష్ట్ర అర్చక ఉద్యోగజాక్ సభ్యులు, అర్చకులు

హన్మకొండ కల్చరల్ : గ్రామాల్లోని ధూపదీప నైవేద్య అర్చకులకు సక్రమంగా ప్రతీనెలా వేతనాలు అందేలా ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగజాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర చేనేత భవన్‌లో నూతనంగా పదవీబాధ్యతలు చేపట్టిన దేవాదాయధర్మాదాయశాఖ కమిషనర్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్‌ను గంగు ఉపేంద్రశర్మ, పరాశరం రవీంద్రాచారి, దేవాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచారి, ఇతర అర్చకులు కలిసి శుభాకాంక్షలు తెలిపి వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్చక ఉద్యోగుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనేక దేవాలయాల్లో క్యాడర్ స్ట్రెంత్‌లేక ఇబ్బంది పడుతున్నారని, ప్రమోషన్లలో అన్యాయం జరుగుతుందని వివరించారు. ప్రమోషన్ల విషయంలో సంబంధిత అధికారులతో జిల్లాల వారీగా నివేదికలు తెప్పించుకుంటానని కమిషనర్ పేర్కొన్నారు.

11,12 తేదీల్లో ఇంటర్ కాలేజీ కబడ్డీ టోర్నమెంట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఆధ్వర్యంలో యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల డిగ్రీ, పీజీ కాలేజీలకు ఇంటర్ కాలేజీ కబడ్డీ టోర్నమెంట్ ఈనెల 11, 12వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ టి. మనోహర్ తెలిపారు. ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్, సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌కు సెలక్షన్స్ కూడా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కేయూ పరిధిలోని డిగ్రీ, పీజీ కాలేజీల నుంచి కబడ్డీ క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనబోతున్నారని తెలిపారు. ఈ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా కేయూ రిజిస్ట్రార్ వి రామచంద్రం, స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య పాల్గొంటారని చెప్పారు.

ప్రతినెలా 1న జీతాలు చెల్లించాలి


ఎన్పీడీసీఎల్ సీఎండీ పేషీలో అధికారికి వినతి పత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు కోరారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ గెస్ట్‌హౌస్‌లో జేఏసీ ఎన్పీడీసీఎల్ శాఖ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఈ నెల 9వ తేదీ వరకు ఉద్యోగులకు జీతాలు అందకపోవడంపై చర్చించారు. అనంతరం టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఫైనాన్స్ డైరెక్టర్ వి.తిరుపతి రెడ్డి, సీఎండీ పేషీలో అధికారికి వినతి పత్రాలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జీతాలు ఆలస్యమైతే వైద్య ఖర్చులు, అప్పుల వాయిదాలు, కుటుంబ అవసరాలకు అవస్థలు పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎ.విజేందర్ రెడ్డి, కేవీ.జాన్సన్, ఎస్.మల్లికార్జున్, బండారి ప్రభాకర్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

బైక్.. భద్రం!


వరద నీటిలో పార్క్ చేసిన వాహనాలు(ఫైల్)

వర్షాకాలంలో ద్విచక్రవాహనాలను జాగ్రత్తగా చూసుకోవాలి
- ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా మెకానిక్ షెడ్‌కు వెళ్లాల్సిందే
- మరమ్మతుకు చేతిలో వేలాది రూపాయలు ఉండాల్సిందే..
- వర్షపు నీటిలో ప్రయాణించొద్దని మెకానిక్‌ల సూచన

ఖిలా వరంగల్: వర్షాకాలంలో ద్విచక్రవాహనాలను భద్రంగా చూసుకోవాలి. వర్షం కురుస్తున్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయాణించొద్దు. అప్పుడే బైక్‌లు కొద్దికాలంపాటు మన్నికగా ఉంటాయి. ఇలా కాకుండా నిర్లక్ష్యంగా నడిపితే వాహనాలు మరమ్మతులకు గురవుతాయి. అప్పుడు కనీసం రూ.2వేలు చేతిలో ఉండాల్సిందే. ఇంజన్ పాడైతే రూ.6వేల నుంచి రూ.8వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఏమాత్రం నిర్లక్ష్యం చేసిన అదనపు భారం పడే అవకాశముంది. ఒక్కసారిగా ఇంత ఖర్చు చేయాలంటే సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు భారమే. కనీస జాగ్రత్తలు పాటిస్తే వాహనాలు మన్నికగా ఉంటాయని సీనియర్ మెకానిక్ అంకాల సతీశ్ చెబుతున్నారు.

బైక్‌ల నిర్వహణ గాలికి..

వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3.50లక్షల పైగా ద్విచక్రవాహనాలు ఉన్నాయి. ఏటా సుమారు రూ.20వేలకు పైగా కొత్త వాహనాలు రహదారులపైకి వస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసిన చాలా మంది వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదు. ఫలితంగా మరమ్మతులకు గురవడంతో వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది.


వర్షంలో ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారుడు (ఫైల్)

నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడే పార్క్..

వర్షం కురుస్తున్న సమయంలో పలువురు తమ వాహనాలను నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ ఆపుతారు. దీంతోపాటు వాహనాన్ని రహదారులపై మెకాలి లోతులో నిలిచిన నీటి నుంచి నడుపుకుంటూ వెళ్తారు. ఇలా చేయడం వల్ల పలు భాగాల్లోకి నీరు చేరి బైక్ మొరాయిస్తుంది. లాక్ సిస్టమ్, ప్లగ్, కేబుళ్లు, బ్రేకులు, ఇంజన్, ఫైరింగ్ సిస్టమ్.. ఇలా వాహనంలో ప్రతీ వస్తువు పాడయ్యే అవకాశముంది.

వాహనం నీటిలో నానితే బ్రేక్ సిస్టమ్‌పై ప్రభావం..

వాహనం నీటిలో నానితే బ్రేక్ సిస్టమ్‌పై ప్రభావం చూపుతుంది. మరో వైపు ప్రతీ వాహనదారుడు తమ వాహనానికి సంబంధించి టైర్లు, బ్రేకులు బాగున్నాయా..? లేవా..? అని తనిఖీ చేయాలి. దీంతోపాటే చైన్‌ను కూడా లూబ్రికేషన్ చేయించాలి. తడిస్తే తుప్పు పడుతుంది. ఈనేపథ్యంలో చైన్ లూబ్రికేంట్‌ను వాడడం మంచిది. వర్షాకాలంలో తడి, నీళ్ల రోడ్లపై చాలా మంది ప్రయాణిస్తుంటారు. ఈ నేపథ్యంలో మొదట వాహన టైర్లను తనిఖీ చేయాలి. అరిగిపోయి ఉంటే వాటిని మార్చుకోవాలి. బ్యాటరీ పూర్తిగా చార్జింగ్ చేసి మంచి స్థితిలోఉందో.. లేదో చూసుకోవాలి. వర్షానికి వాహనం తడిస్తే ఆ ప్రభావం పలు భాగాలపై పడుతుంది. విజిబిలిటీ బాగుండాలంటే బ్యాటరీ ఫుల్‌గా ఉండాలి. బల్బు పోతే వెంటనే మార్చుకోవాలి.

బైక్‌ను భద్రంగా కాపాడుకోవాలి..

వర్షం కురుస్తున్న సమయంలో బైక్‌పై ప్రయాణం ప్రమాదకరం. బ్రేక్‌లు, క్లచ్‌లు పనిచేయక బైక్ అదుపు తప్పి ప్రమాదం జరుగుతుంది. లోతట్టు ప్రాంతాల్లో ప్రయాణిస్తే సైలెన్సర్ ద్వారా ఇంజిన్‌లోకి వరదనీరు చేరి బైక్ పాడవుతుంది. తద్వారా మరమ్మతుకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇలా కాకుండా కొన్ని జాగ్రత్తలు పాటిస్తూ వర్షాకాంలో బైక్‌ను భద్రంగా కాపాడుకోవాలి.

అంకాల సతీశ్,
సీనియర్ బైక్ మెకానిక్

వర్షాకాలంలో సూచనలు..

నీటిలో వాహనం నడపొద్దు.. వర్షాకాలంలో రోడ్లపై పెద్ద ఎత్తున నీరు నిలిచి ఉంటుంది. ఈమార్గాల్లో వెళ్లకపోవడం శ్రేయస్కరం. మరో వైపు నీటిలో గుంతలు కనిపించకపోవడంతో అందులో పడిపోయే ప్రమాదం ముంది. దీంతోపాటు వాహనం ఎగ్జాస్టర్‌లోకి నీరు చేరే ఆస్కారముంది. ఫలితంగా వాహనం ఆగిపోతుంది. ఇంజన్ పాడవుతుంది. వాహనంలో ముఖ్యమైన భాగం ఇంజన్. ఇంజన్ ఫెయిలైతే వేలాది రూపాయలు ఖర్చు చేయాలి. అందుకే వర్షాకాలంలో సైలెన్సర్‌లోకి నీరు వెళ్లకుండా చూసుకోవాలి.

వాహనంపై కవర్ కప్పాలి..

వర్షానికి వాహనం తడుస్తున్నా చాలా మంది ద్విచక్ర వాహనదారులు పెద్దగా పట్టించుకోరు. బయట తిరిగి ఇంటికి వచ్చిన అనంతరం వర్షంలోనే వాహనం నిలుపుతారు. ఇలా ఎప్పుడూ చేయొద్దు. తప్పని సరిగా వాహనంపై కవర్ కప్పాలి. వర్షం పడని ప్రాంతంలో పార్క్ చేస్తే భద్రంగా ఉంటుంది.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న కేంద్రం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

తొర్రూరు: తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని విశ్రాంతి భవనంలో బుధవారం బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. రాష్ట్రపతి భవన్, రాజ్‌భవన్‌ను కేంద్రం జేబు సంస్థలుగా మార్చుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటి మండల్ నుంచి నేటి బీసీ బిల్లు వరకు బీజేపీ బీసీలను మోసగిస్తోందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పెట్టిందని, కేంద్రం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో పెట్టి అమలు చేస్తుందా లేదా చెప్పడం లేదన్నారు.


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర బీజేపీ నేతలు మాట్లాడకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరడం హాస్యాస్పదమన్నారు. రిజర్వేషన్ల అమలు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీ రిజర్వేషన్లపై త్వరలో సింహగర్జన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కేయూ ప్రొఫెసర్ మల్లేశ్వర్, నాయకులు గుండగాని వేణు, గట్టు ప్రభాకర్, పెదగాని సోమయ్య, మురళి యాదవ్, భిక్షంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ చరిత్ర భావితరాలకు తెలియజేయాలి

- ఓబీసీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్

హన్మకొండ: చాకలి ఐలమ్మ చరిత్ర భావితరాలకు తెలియజేయాలని ఓబీసీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. నక్కలగుట్టలోని హోటల్ హరిత కాకతీయలో చాకలి ఐలమ్మ వర్ధంతి, మహిళా చైతన్య సదస్సు ఓబీసీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ టి.విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగింది. ముందుగా ఐలమ్మ చిత్రపటానికి సుందర్‌రాజ్ యాదవ్, అతిథులు, మహిళలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి మహిళా చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా మేధావులు, ఉద్యోగులు, అధ్యాపకులు, సామాజిక ఉద్యమకారులతో కలిసి ఓబీసీ ఏర్పాటు చేశామన్నారు. భూమి.. భుక్తి.. వెట్టి చాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ పోరాటం చేసిందని గుర్తు చేశారు. మలిదశ తెలంగాణ కోసం త్యాగాలు చేసిన 1200 మందిలో 80 శాతం మంది బీసీలేనన్నారు. అయినా ప్రభుత్వ పాలసీల్లో బీసీల ఊసేలేదని లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ బిల్లు ప్రకారం పెరిగే సీట్లతో 153 స్థానాల్లో 51 మంది మహిళలు ఉండబోతున్నారన్నారు. 51 మందిలో 26 సీట్లు బీసీ మహిళలు సాధించేలా కొట్లాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు ఇవ్వకపోవడంతో బీసీ విద్యార్థులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓబీసీ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, కార్పొరేటర్లు చీకటి శారద, బైరి లక్ష్మి, రావుల కోమల, విజయశ్రీ, మహిళా ప్రతినిధులు దాసోజు లలిత, డాక్టర్ నాగవాణి, డాక్టర్ రమ, అరుణ, లక్ష్మి, ఓబీసీ నాయకులు అరవింద్‌స్వామి, ఎంఎస్ మూర్తి, వేణుమాధవ్, సరిత, మౌనిక, భవాని, సరస్వతి, పద్మజ, ప్రవల్లిక, శ్రావణి, షైన్, పల్లవి, శ్రీలత, విద్యార్థినులు, మహిళలు పాల్గొన్నారు.


ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, మహిళలు

ఆస్తి కోసం తల్లిని హత్య చేసిన కుమార్తె

- పాలకుర్తి మండలం పెద్దతండా (కే)లో దారుణం


లక్ష్మి (ఫైల్)

పాలకుర్తి టౌన్: ఆస్తి కోసం భర్తతో కలిసి కుమార్తె.. తల్లిని హత్య చేసింది. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం పెద్దతండా (కే) గ్రామంలో జరిగింది. సీఐ జానకీరాంరెడ్డి కథనం ప్రకారం.. పెద్దతండా(కే)కు చెందిన బాదావత్ లక్ష్మి (42) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆమె భర్త తిరుపతి 15 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. ఈ దంపతులకు సంగీత ఏకైక సంతానం. ఈమెకు ఐదేళ్ల క్రితం ఇదే మండలంలోని దుబ్బతండా(ఎస్‌పీ) గ్రామానికి చెందిన బానోత్ వీరన్నతో వివాహం చేశారు. తల్లి పేరిట ఉన్న 20 గుంటల వ్యవసాయ భూమి తన పేరుతో పట్టా చేయాలని సంగీత పలుమార్లు అడిగింది. ఇందుకు తల్లి నిరాకరించింది. దీంతో ఎలాగైనా ఆ భూమిని దక్కించుకునేందుకు తల్లిని హత్య చేయాలని ప్లాన్ వేసింది. ఈ విషయాన్ని భర్తతో చర్చించింది. ఇరువురు హత్య చేయాలని నిర్ణయం తీసుకొని మంగళవారం రాత్రి పెద్దతండాకు చేరుకున్నారు. కూతురు సంగీత, అల్లుడు వీరన్న కలిసి నిద్రలో ఉన్న లక్ష్మి మొఖంపై దిండుపెట్టి హత్య చేశారు. కూలి పని కోసం పిలవడానికి వెళ్లిన స్థానిక మహిళ చూసి తండావాసులకు బుధవారం తెలుపగా వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి తండ్రి నేనావత్ చంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జానకీరాంరెడ్డి తెలిపారు.

డెంగీతో చిన్నారి మృతి


సంహిత (ఫైల్)

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వనపర్తి గ్రామానికి చెందిన కొడె ఉపేందర్, అనిత దంపతుల కూతురు సంహిత(07) బుధవారం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉపేందర్, అనిత దంపతులు జనగామలో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇటీవల గ్రామంలో బోనాలు, ఇతర పండుగలు రావడంతో అనిత స్వగ్రామం కోడూరుకు, అత్తగారిల్లు వనపర్తికి వెళ్లి వచ్చారు. ఈ క్రమంలో సంహితకు పదిహేను రోజుల క్రితం తీవ్ర జ్వరం రావడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు, అనంతరం చంపక్‌హిల్స్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ జ్వరం తగ్గకపోవడంతో హైదరాబాద్‌లోని నిలోఫర్‌కు తరలించగా డెంగీ అని నిర్ధారణ అయ్యింది. దీంతో చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చిన్నారి సంహిత మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ విషయంపై స్థానిక వైద్యురాలు స్వర్ణలతను వివరణ కోరగా ఆ కుటుంబం జనగామలో నివాసం ఉంటోందని తెలిపారు.

మాడవీధుల నిర్మాణ పనుల పరిశీలన


మాడవీధుల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహశబరీష్, 'కుడా' అధికారులు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని బుధవారం సాయంత్రం హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారు. అమ్మవారిని దర్శించి పూజలు చేసిన అనంతరం అర్చకులు శేషవస్త్రాలు, మహదాశీర్వచనం అందజేశారు. అనంతరం మాడవీధుల పురోగతిని 'కుడా' అధికారులతో చర్చించి పనులు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల నుంచి మాడవీధి గుండా ప్రవేశం మార్గం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అడ్డంగా ఉన్న నిర్మాణాలను తొలగించి నవరాత్రులకు రెండు రోజుల ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయం ముందు ఉన్న, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. అనంతరం బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వేయిస్తంభాల దేవాలయాన్ని ఆమె సందర్శించారు. బతుకమ్మ వేడుకల ఏర్పాట్లకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, ఆలయ చైర్మన్ డాక్టర్ బండారు శివసుబ్రహ్మణ్యం, ఆలయ అర్చకులు భద్రకాళి శేషు, 'కుడా' అధికారులు అజిత్‌రెడ్డి, భీంరావు, ఆర్డీఓ రమేశ్, వరంగల్ ఏసీపీ సత్యనారాయణ, మట్వాడ సీఐ కరుణాకర్, తహసీల్దార్ రవీందర్ ఉన్నారు.

ఉపాధి శిక్షణతో ఆర్థికాభివృద్ధి

హన్మకొండ: మహిళల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు ఉపాధి శిక్షణ దోహదపడుతుందని హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. బుధవారం హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో మహిళా సాధికారత మేళా కార్యక్రమం జరిగింది. మగ్గం శిక్షణ, టైలరింగ్, బ్యూటిషన్ ట్రైనింగ్ పొందిన 350 మంది మహిళలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉపాధి శిక్షణతో కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందన్నారు. అడిషనల్ డీసీపీ రవి, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, సంస్థ రీజినల్ అధ్యక్షులు రుమాల్డిన, ప్రాజెక్టు కోఆర్డినేటర్లు ఎర్ర శ్రీకాంత్, బత్తుల కరుణ, ఆయా సంస్థల ప్రతినిధులు అనితారెడ్డి, కె.నాగవాణి, ఆల్బటా అమృత, ఎం,అజయ్‌కుమార్, ఈసంపల్లి సుదర్శన్, పరికి సుధాకర్, సుదర్శన్ గౌడ్, ప్రభాకర్, శివప్రసాద్, కొమ్ముల నవీన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే

దానాపూర్ రైలుకు చర్లపల్లిలో హాల్టింగ్

- పండుగల రద్దీ దృష్ట్యా 10 రోజులపాటు అమలు..

కాజీపేట రూరల్ : ప్రయాణికుల సౌకర్యార్థం దీపావళి, దసరా, చాత్‌పూజా పండుగల సందర్భంగా కాజీపేట జంక్షన్ మీదుగా వెళ్లే సికింద్రాబాద్–దానాపూర్ డైలీ ఎక్స్‌ప్రెస్‌కు చర్లపల్లిలో తాత్కాలికంగా హాల్టింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. సెప్టెంబర్ 10వ తేదీ నుంచి 10 రోజులపాటు పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్లపల్లిలో హాల్టింగ్ కల్పించినట్లు తెలిపారు.

హాల్టింగ్ వివరాలు..

సికింద్రాబాద్–దానాపూర్ (12791) ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్‌లో 9: 25 గంటలకు బయలుదేరి చర్లపల్లికి 9:40 గంటలకు, కాజీపేటకు 11:08 గంటలకు చేరుతుంది. అదేవిధంగా దానాపూర్–సికింద్రాబాద్ (12792) ఎక్స్‌ప్రెస్ దానాపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు కాజీపేటకు 18:23 గంటలకు, చర్లపల్లికి 20:42 గంటలకు, సికింద్రాబాద్‌కు 21:30 గంటలకు చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు.



నేడు నాలుగు ప్యాసింజర్ రైళ్లు రద్దు..

కాజీపేట రూరల్ : కాజీపేట–విజయవాడ మార్గంలో నెక్కొండ–కేసముద్రం–మహబూబాబాద్ మధ్య చేపడుతున్న థర్డ్ లైన్ కమిషనింగ్ ఎన్ఐ వర్క్స్ కారణంగా గురువారం పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ బుధవారం తెలిపారు.

నేడు రద్దయ్యే రైళ్ల వివరాలు..

కాజీపేట–డోర్నకల్ (67765) ప్యాసింజర్, డోర్నకల్–కాజీపేట (67766) ప్యాసింజర్, డోర్నకల్–విజయవాడ (67767) ప్యాసింజర్, విజయవాడ–డోర్నకల్ (67768) ప్యాసింజర్లను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

పాక్షికంగా రద్దు..

భద్రాచలం రోడ్–బల్లార్షా (17033) సింగరేణి ప్యాసింజర్‌ను భద్రాచలంరోడ్–కాజీపేట మధ్య పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు సీపీఆర్వో తెలిపారు.

బిల్లింగ్‌లో మానవ రహిత సేవలు

- హెచ్‌టీ మీటర్‌లో ఆటోమేటిక్ మీటర్ రీడింగ్
- సులువుగా హెచ్‌టీ సర్వీస్‌ల బిల్లింగ్
- మోడెంలు బిగిస్తున్న ఎన్పీడీసీఎల్
- మీటర్ స్థితి, విద్యుత్ వినియోగం, సరఫరా సమాచారం వెంట వెంటనే చేరవేత

హన్మకొండ: ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ టీజీ ఎన్పీడీసీఎల్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ప్రతీవిభాగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేస్తూ సేవల్లో కచ్చితత్వాన్ని తీసుకువస్తున్నారు. ఈ క్రమంలోనే హెచ్‌టీ మీటర్ రీడింగ్ నమోదులో ఆధునిక సాంకేతికతను చొప్పిస్తోంది. మానవ ప్రమేయం లేకుండా మీటర్ రీడింగ్ నమోదు చేసే పరికరాన్ని అమరుస్తున్నారు. ఇప్పటివరకు హెచ్‌టీ సర్వీస్‌ల స్థాయిలను బట్టి ఏడీఈ, ఏఈలు వెళ్లి మీటర్ రీడింగ్ నమోదు చేసేవారు. విద్యుత్ వాడుకునే కేటగిరీ వారీగా 55 హెచ్‌పీకి మించిన సామర్థ్యం ఉన్న మీటర్ల రీడింగ్‌ను ఏడీఈలు, 55 హెచ్‌పీలోపు ఉన్న సర్వీస్‌ల మీటర్ రీడింగ్‌లను ఏఈలు, నాన్ స్లాబ్ రీడింగ్‌ను లైన్ ఇన్‌స్పెక్టర్లు, స్లాబ్ రీడింగ్‌ను జేఎల్ఎంలు తీస్తున్నారు. వీరు హెచ్‌టీ మీటర్లను సందర్శించి వాటి రీడింగ్ తీసుకువచ్చి కార్యాలయాల్లో కంప్యూటర్లలో నిక్షిప్తం చేసి విద్యుత్ వినియోగదారులకు బిల్లులు పంపేవారు. దీంతో సమయం వృథా అయ్యేది. లోపాలు తలెత్తేవి. వీటిని అధిగమించి కచ్చితత్వంతో బిల్లులు అందించేందుకు ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ సిస్టంను అమలు చేస్తున్నారు.


ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ నమోదు చేసే మోడమ్‌ను చూపిస్తున్న ఎమ్మార్టీ డీఈ దర్శన్ కుమార్

ఆటోమేటిక్ మీటర్ రీడింగ్‌కు మోడెంల ఏర్పాటు..

హెచ్‌టీ సర్వీస్ మీటర్‌లతోపాటు, ఎల్‌టీలోనూ హెచ్‌టీ మీటర్లు వినియోగిస్తున్న సర్వీస్‌ల్లో ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ నమోదు చేసే మోడమ్‌ను బిగిస్తున్నారు. ఈ ప్రక్రియ వేగంగా సాగుతోంది. డిసెంబర్ నాటికి అన్ని సర్కిళ్లలో పూర్తి చేస్తామని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి సర్కిల్‌లో పనులు జరుగుతున్నాయి. హెచ్‌టీ మీటర్లకు అమర్చుతున్న మోడెం ద్వారా కచ్చితమైన సమాచారం వస్తుందని అధికారులు తెలిపారు. మీటర్ స్థితి, విద్యుత్ వినియోగం, సరఫరా సమాచారం రియల్ టైంలో వస్తుంది. దీంతో పొరపాట్లకు తావుండదు. జీఎస్ఎం/జీపీఆర్ఎస్ టెక్నాలజీతో రూపొందించిన ఈ మోడెంను హెచ్‌టీ మీటర్‌కు అనుసంధానం చేయడం ద్వారా ప్రతి 15 నిమిషాలకు ఒకసారి వినియోగమైన యూనిట్ల వివరాలను కచ్చితత్వంతో కార్పొరేట్ కార్యాలయానికి చేరవేస్తుంది. టీజీ ఎన్పీడీసీఎల్‌లో మొత్తం హెచ్‌టీ మీటర్లు 4,013, ఎల్‌టీ సర్వీస్‌ల్లో హెచ్‌టీ మీటర్లు 2,254 ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 1,650 మీటర్లకు ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ నమోదు చేసే మోడెంలను అమర్చారు.


బెల్ట్‌షాపులపై దాడులు

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరంగల్ ఏఎస్పీ శుభం ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్ బుధవారం బెల్ట్‌షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ మేరకు రూ.12 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుని, బెల్ట్‌షాపు నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తెల్లవార్లు బెల్ట్‌షాపులు కొనసాగించడం వల్ల నిత్యం గొడవలు జరుగుతున్నాయని, పద్ధతి మార్చుకోకుంటే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ శుభం హెచ్చరించారు.

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధి గుండ్లసింగారంలోని ఎస్సారెస్పీ కాల్వకట్టతోపాటు పెగడపల్లి డబ్బాల ప్రాంతాల్లోని బెల్ట్‌షాపులపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు రూ.25 వేల మద్యంతోపాటు రూ.5 వేల విలువైన గుట్కాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో హనుమకొండ ఏసీపీ నర్సింహరాములు స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలు రవీందర్, శ్రీకాంత్, కల్యాణ్, నవీన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


బెల్ట్‌షాపులో నిల్వలను పరిశీలిస్తున్న మిల్స్‌కాలనీ పోలీసులు

సాహితీవేత్త రంగారావు మృతి


రంగారావు (ఫైల్)

విద్యారణ్యపురి: అనారోగ్య సమస్యలతో కవి, కథకుడు, వ్యాసకర్త సంధ్య రంగారావు (82) బుధవారం హైదరాబాద్‌లో మరణించారని కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి, కార్యదర్శి వీఆర్‌విద్యార్థి తెలిపారు. కాళోజీ సోదరులు స్థాపించిన మిత్రమండలికి సుమారు 12 ఏళ్లపాటు రంగారావు కన్వీనర్‌గా సేవలందించారని గుర్తుచేశారు. ఆయన మృతిపై కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, గంట రామిరెడ్డి, ప్రొఫెసర్ బన్న అయిలయ్య, పందిళ్ల అశోక్‌కుమార్, డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్ సంతాపం తెలిపారు.

డే కేర్ సెంటర్‌లో ఉచిత న్యాయ సలహాలు

హన్మకొండ: హనుమకొండ జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో సీనియర్ సిటిజన్స్ కోసం ప్రారంభించిన లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయ సలహాదారుగా పారాలీగల్ వలంటీర్ ఎం. ఉపేందర్‌ను నియమించింది. ప్రతీ బుధ, శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు న్యాయ సలహాలు అందిస్తారని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగేందర్ తెలిపారు. వివరాలకు 8074979359 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తాడూరి లక్ష్మీనారాయణ, గంగారపు యాదగిరి, సుమతి, డాక్టర్ ఉష, తదితరులు పాల్గొన్నారు.


వృద్ధుల డే కేర్ సెంటర్‌లో న్యాయ సలహాలు ఇస్తున్న పారా లీగల్ వలంటీర్ ఉపేందర్